"ఏంటి ఇంకా రాలేదా? ఆగు పర్మిషన్ తీసుకుని వచ్చేస్తాను!"

* * *

"ఏంటో ఈ ముసలోళ్ళు...పెట్టింది తిని క్రిష్ణా..రామా! అనుకుంటూ ఓ మూల కాలు చాపుకోక ఇవేం పనులూ?" కోపంగా అన్నాడు గుండు.

"ఏమో బాబూ! నిజంగా మీ నాన్నగారు ఇంటికి తిరిగి రాకపోతే కోడలు ఏ రాచి రంపాన పెట్టిందో, ఇల్లు విడిచి పోయారంటే అని దుమ్మెత్తిపోస్తుందండి లోకం!"

ఇంతలో ఫోన్ మోగింది.

"ఈ ముసలాయన దారితప్పి దిక్కు తెలియక ఫోన్ చేసుంటాడు" అనుకుంటూ ఫోన్ తీసాడు గుండు.

"హలో..నేను పంబాగ్రూపు నాయకుణ్ని!"

"అయితే ఏంటట?"

"మీ నాన్న శశిధర్ని మేం కిడ్నాప్ చేసాం! ఇరవై నాలుగ్గంటల్లో అయిదు లక్షలిస్తే వదిలేస్తాం..లేదంటే చంపేస్తాం!"

"మా నాన్న శశిధర్ని మీరు కిడ్నాప్ చేసారా? అయిదు లక్షలు ఇవ్వాలా? తొక్కేం వద్దూ? ఆయన మాకు అవసరం లేదు. మీరే ఉంచుకుని పెంచుకోండి. ఆ ముసలిప్రాణం విలువ అయిదు లక్షలా? అసలే రోగిష్టి మనిషి. ఆయనగారి మందులకు, డాక్టర్ల ఫీజులకు వందలు వదులుతున్నాయి. ఎలా వదిలించుకోవాలో అర్థంకాక ఇంత కాలం లోకానికి భయపడి భరించాము. ఇప్పుడా పుణ్యమేదో మీరే కట్టుకోండి. డబ్బేం చెట్లకు కాస్తున్నాయా? కోసి ఇవ్వడానికి? అర్థరాత్రి ఆయాసంతో పాటు దగ్గు మొదలెట్టారంటే మీ చెవుల్లో రక్తం కారడం ఖాయం!" అంటూ గుండు ఏదేదో మాట్లాడుతున్నాడు.

గోడకు వేలాడుతున్న శ్రీలక్ష్మి ఫోటో మాత్రం దీనంగా రోదిస్తున్నట్లుంది.

**-లక్ష్మీ భారతీ రెడ్డి (కువైట్)**

○○○




"కాఫీ" అంటూ శ్రీమతి కేక పెడుతున్నా వినిపించుకోకుండా పేపరుబోయ్ పేపరేసాడేమోనని వీధి గుమ్మంలోకెళ్ళాడు హనుమంతు.

కాషాయ వస్త్రాలు ధరించిన నలుగురు వ్యక్తులు రసీదు పుస్తకాలు పట్టుకుని తన ఇంటివైపు రావడం గమనించి 'హరి నాయనో!..ఎవరో చందాకోసం వస్తున్నట్లుంది. వీళ్ళుగాని అలివేణి కంటబడ్డారో తన కొంప కొల్లేరే' అనుకుంటూ గభాలున లోపలకొచ్చి దభాలున తలుపేసుకున్నాడు.

అతడలా హడలిపోడానికి కారణం తెలుసుకోవాలనుకుంటే ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళవలసిందే.

హనుమంతు అలివేణి మెడలో తాళి కట్టి నేటికి ఏడేళ్ళవుతోంది. తను ఎలా వున్నా ఆమె మాత్రం అందాలరాశి. అపరంజిబొమ్మే. అందుకే కాణీకట్నం లేకుండా పెళ్లి చేసుకున్నాడు. పెళ్లైన తొలిదినాల్లో దైవం పట్ల ఆమెకున్న భక్తిశ్రద్ధల్ని చూసి మురిసిపోయాడు. బీద బిక్కి పట్ల ఆమె కనపరిచే జాలికి చలించిపోయాడు. అయితే రాను రాను ఆమెలోని దయార్థ్రగుణాలు తన జేబుకి చిల్లులు చేయడంతో కాస్త ఇబ్బంది పడ్డాడు. ఏ అనాథ అయినా ముగింట్లోకొచ్చి కట్టుకోడానికి ఓ కోక ధర్మం చేయండమ్మా అంటే చాలు ముందు వెనుక చూడకుండా వంటిమీద చీర ఒలిచి ఇచ్చేస్తుంది. మొన్నటికి మొన్న ఎవరో అన్నదానం చేస్తున్నామంటే వాళ్ళకి వెచ్చాలతోపాటు భారీగా డబ్బులు కూడా ముట్టచెప్పింది. దానగుణంలో ఇల్లాలు కర్ణుణ్ణి మించిపోవడంతో జీతంలో సగం దానధర్మాలకే సరిపోతోంది.

ఆమె చేసేవి మంచిపనులే కావడం వల్ల తను అడ్డు చెప్పలేకపోతున్నాడు. అలా అని మనసుండబట్టక ఎప్పుడైనా కాస్త పొదుపుగా ఉండవే అంటే చాలు. "మనకి పిల్లా పీచూ ఎవరున్నారని చెప్పండి మూటగట్టి ఇవ్వడానికి" అంటుంది. నిజమే తనకి పిల్లలు లేకపోవచ్చు. తామిరువురూ బతకడానికైనా డబ్బుండాలా? ఇంకా ఏమైనా అంటే మనం ఇప్పుడు అంతో ఇంతో ధర్మం చేస్తే రేపు అంతకు పదింతలు అదే వచ్చి పడుతుందంటుంది. మరి ఇటువంటి ఇల్లాలిని ఇబ్బంది పెట్టకుండా తను ఇబ్బంది పడకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు తెలిసుండాలి. అయితే అవి మన హనుమంతులో పుష్కలంగానే ఉన్నాయిలెండి. అందుకే నెగ్గుకు రాగలుగుతున్నాడు.

"పొద్దున్నే తలుపు బిడాయించేస్తే కూరలవాడి కేక ఎలా వినిపిస్తుందండి" అన్నది అలివేణి భర్త చేష్టలకు అబ్బురపడుతూ.

అంతలోనే తలుపు దభీ దభీమంది.

గుండె దడదడ లాడింది హనుమంతుకి.

"ఎవరో చూడండి" అంది అలివేణి.

అయిష్టంగానే తలుపు తెరిచాడు హనుమంతు.

ఇంకెవరు? వాళ్ళే..రసీదు పుస్తకాలు పట్టుకుని యమకింకరుల్లా నిలబడ్డారు.

ముఖం చిట్లిస్తూ ఏం కావాలన్నట్లు చూసాడు హనుమంతు.

"రామాపురంలో రాముడి దర్శనార్థం వచ్చే యాత్రీకుల కోసం ఓ ధర్మ సత్రం కట్టించాలని సంకల్పించాం. అందుకు దేశమంతా తిరుగుతూ చందాలు పోగుచేస్తున్నాం" అన్నారు వచ్చిన వాళ్ళు.

"ఎక్కడో మీరు సత్రవ కడితే ఇంత దూరం వచ్చి మమ్మల్ని చందాలడగడం సబబుగా లేదు" అన్నాడు హనుమంతు.

పెనిమిటి మాటలు విన్నదేమో "అదేమిటండీ అలా అంటారు. మంచి పని ఎవరు ఎక్కడ చేసినా అంతా సహకరించాలి. అంతటి బృహత్తర కార్యక్రమాన్ని వాళ్ళు తలపెట్టినప్పుడు మనం వాళ్ళని ఉత్తచేతులతో పంపిస్తే పాపం కదా! ఓ వెయ్యి రూపాయలు తక్కువ కాకుండా రాయండి" అంది అలివేణి దగ్గరకొచ్చి.

ఆ మాటతో రసీదు పుస్తకం ఇస్తూ ఎంతో ఆశగా చూసారు వచ్చినవాళ్ళు.

"పిచ్చిదానా! వారు తలపెట్టిన ఈ మహాయజ్ఞానికి వెయ్యి రూపాయలు ఏం సరిపోతాయే" అన్నాడు హనుమంతు.

భర్త తను అన్నదానికంటే ఎక్కువ మొత్తంలో విరాళమివ్వడానికి సిద్ధపడుతున్నాడని తెలిసి ఎంతగానో సంతోషించింది అలివేణి.

"యాత్రికుల కోసం మీరెన్ని అంతస్తుల భవనం కట్టాలనుకుంటున్నారు" అడిగాడు హనుమంతు.

"మూడు" ఠక్కున సమాధానమిచ్చాడు వాళ్ళలో ఒకడు.

"ఒక్కో అంతస్తుకి ఎంత అవుతుందని మీ అంచనా?"

"ఎంతలేదన్నా పదిహేను లక్షలవుతుంది"

"అయితే నేను మూడో అంతస్తు కట్టించే పూర్తి బాధ్యత తీసుకుంటాను సరేనా?" అన్నాడు హనుమంతు.

పెనిమిటి మాటలకు ఆనందంతో ఉప్పొంగిపోయింది అలివేణి.

వెంటనే రసీదు పుస్తకం అందించారు వాళ్ళు.

"ఊహూ ఇప్పుడు కాదు మీరు రెండతస్తులు వేసేకా నన్ను కలవండి, మూడో అంతస్తు నేను దగ్గరుండి కట్టిస్తాను"

ఆ మాటకు వాళ్ళు ఏమనుకున్నారో ఏమో మరి కిమ్మనకుండా జారుకున్నారు.

తర్వాత వాళ్ళు మరి రాను లేదు. తను ఆ అంతస్తు కట్టనూ లేదు.

**-దూరి వెంకటరావు (విజయనగరం)**